www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 15 | జూలై | 2026
పేజీలు : 8

## బీడు భూములుగా మారుతున్న పొలాలు


ఎల్‌నినో ప్రభావంతో దిగాలు పడ్డ రైతులు

2 లో

# పోలవరంతో భద్రాద్రికి జలగండం..?


(ఊహాజనిత చిత్రం)

- 24.88 లక్షల క్యూసెక్కులకే 71.3 అడుగుల వరద
- 2022 వరద ప్రమాద హెచ్చరికను దాటి ఉప్పెనగా మారి
- బ్యాక్ వాటర్ లెక్కలు తేల్చంకుంటే పెను ప్రమాదమే
- పాలకులు మౌనం వీడాలంటున్న ప్రజలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పోలవంర ప్రాజెక్టు భద్రాచలం మన్యాన్ని జలగండంగా మార్చనుందా....? భారీ వరద వస్తే బ్యాక్ వాటర్ భద్రాద్రిని ముంచెత్తుతుందా..? అసలే ఇప్పుడు వరదల కాలం, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోయినప్పటికీ వాతావరణంలో పెనుమార్పులు సంభవించి భారీ వానలు పడితే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వరదలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. 2022లో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 71.3 అడుగులకు చేరింది. 24.88 క్యూసెక్కుల వరదనీరు ప్రవాహం నమోదైంది. 1986 వరదల తర్వాత అతిపెద్ద వరద 2022లో వచ్చింది. 1986 వరదల కంటే 2022లో వచ్చిన వరద తక్కువే అయినప్పటికీ ఎక్కువ ప్రాంతాలు మునకకు గురయ్యాయి. ఈ వరదలు చూపిన ప్రమాద సంకేతాలు భవిష్యత్‌లో మరింత తీవ్ర తరం కానున్నాయా అని, ఇదంతాపోలవరం ప్రాజెక్టు వల్లే అనే అనుమానాలు

మిగతా 2లో..



- రూ. 40 కోట్లతో నిర్మాణం
- మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ
- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల
- నిధుల మంజూరుకు మంత్రి జూపల్లికి లేఖ



## హరిత భవన్‌తో ఖమ్మంకు కొత్త శోభ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పర్యాటక రంగంలో కొత్త శోభ సంతరించుకోనుంది. రాష్ట్ర పర్యాటక పటంలో ఖమ్మం జిల్లాను మరింత ప్రముఖంగా నిలిపేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో హరిత భవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. హరిత భవన్ నిర్మాణంతో పర్యాటక అతిథ్య మౌలిక సదుపాయాల కొరత తీరుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని లకారం పార్కు సమీపంలో నిర్మించనున్న హరిత భవన్ ప్రాజెక్టు పై మంగళవారం సచివాలయంలో

మిగతా 2లో..

## ఫామ్ పాండ్లు, నీటి సంరక్షణ
# యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి




- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్య పర్చాలి
- ఎల్‌నినో ప్రభావిత గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలి
- ఫామ్ పాండ్లు, నీటి సంరక్షణ పంటల సాగుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ల ఏర్పాటుతో పాటు నీటి సంరక్షణ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. భూ గర్భ జలాల పెంపు, పంటల వైవిద్ధ్యకరణ, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేలా అధికారులు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ఫామ్ పాండ్లు, నీటి సంరక్షణ, పంటల సాగు విధానాలపై కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జులై నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుండడంతో భూ గర్భ జలాల మట్టం తగ్గుముఖం పడుతుందని, భూ గర్భ జలాలను పెంచేందుకు దోహదపడే ప్రతి కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని కలెక్టర్

మిగతా 2లో..

- క్యాన్సర్‌ను ఆహ్వానిస్తున్న యువత
- ప్రభుత్వ నిషేధం ఉన్నా యథేచ్ఛగా అమ్మకాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యులు




# గుట్కాతో ప్రాణాలకు ముప్పు..!



**ప్రజాపక్షం/వైరా :** గుట్కా ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా ఎంతోమంది యువత స్వయంగా ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. క్షణిక ఆనందం కోసం గుట్కా, తంబాకు వంటి మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటున్నారు. ప్రభుత్వం గుట్కా విక్రయాలను నిషేధించినప్పటికీ వైరా ప్రాంతంతో పాటు పలుచోట్ల గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు యువత నోటిలో గుట్కా, ఖైనీ,

మిగతా 2లో..

# పోలవరంతో భద్రాద్రికి జలగండం..?

(మొదటిపేజీ తరువాయి)
వ్యక్తమవుతున్నాయి. గోదావరి వరద తీరుతెన్నులు చూస్తే భద్రాచాలనికి పొంచి ఉన్న ముప్పు అతి పెద్దదే అని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాలు శాస్త్రీయ పద్ధతుల్లో లెక్కలు కట్టి నిజాలను ప్రజల ముంగిట ఉంచాలని కోరుతున్నారు. 2022లో 3వ ప్రమాద హెచ్చరికను దాటి 18.3 అడుగుల వరద : ప్రమాద భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాదహెచ్చరిక, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాదహెచ్చరికను జారీ చేస్తారు. కానీ 2022లో గోదావరికి వచ్చిన వరద 71.3 అడుగులు, 24.88 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. అంటే 3వ ప్రమాదహెచ్చరికను దాటి ఏకంగా 18.3 అడుగుల వరద నీరు ప్రవహించి గోదావరి ఉగ్రరూపం దాల్చింది.

**50 లక్షల క్యూసెక్కుల సామర్థ్యం :** పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే సుమారు 50 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరదనీటిని విడుదల చేసే సామర్థ్యంతో రూపొందించారు. ఇందులో సగం స్థాయి సమర్థ్యం 24.88 క్యూసెక్కుల వరద ప్రవాహం గోదావరి పరివాహకంలో 2022లో నమోదైంది. 71.3 అడుగుల గోదావరి నీటి మట్టం భద్రాచలం వద్ద నమోదైంది. దీంతో ఈ ప్రాంతం అతలాకుతలమైంది. భవిష్యత్‌లో ఇంతకంటే ఎక్కువ వరద వస్తే పరిస్థితి ఏంటీ అనేదే ప్రజల భయం. గోదావరి వరదతో పాటు బ్యాక్‌వాటర్ తోడైతే భద్రాచలంతో పాటు గోదావరి పరివాహక పరిసర ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై స్పష్టమైన సమాధానాలు కరువయ్యాయి. ఈ అనుమానాలకు తెరదించాలంటే ప్రభుత్వాలు శాస్త్రీయమైన పద్ధతుల్లో లెక్కలు తేల్చి ప్రజల ముందు ఉంచాలని పలువురు కోరుతున్నారు.

**బ్యాక్ వాటర్ తోడైతే...? :** పోలవరం పూర్తి జలాశయం మట్టం 150 అడుగులు(45.72 మీటర్లు) భారీవరద సమయంలో గోదావరి సహజ ప్రవాహంపై బ్యాక్ వాటర్ ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్నదే కీలకం. భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని ఉపనదులు, వాగులు, వంకలు కాలువలు, డ్రైన్ల నీరు గోదావరిలో సాఫీగా చేరని పరిస్థితి ఏర్పడితే లోతట్టు ప్రాంతాలు వేగంగా జల దిగ్బంధంలో చిక్కుకునే పరిస్థితి ఉందనే ఆందోళన తీవ్రంగా వ్యక్తమవుతోంది.

**భయ పెడుతున్న 2022 గోదావరి వరద :** 2022 గోదావరి వరద భద్రాచలం ప్రాంతానికి చేదు అనుభవాన్నే మిగిల్చాయి. అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రహదారి సంబంధాలు తెగిపోయాయి. వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో వినియోగంలోనికి రాకముందే గోదావరి ఈ స్థాయిలో భయపెడితే ప్రాజెక్టు పూర్తయిన తర్వాత భారీ వరదల సమయంలో పరిస్థితి ఏంటన్న ఆందోళన పరివాహక ప్రాంత ప్రజలను వెంటాడుతోంది.

**సగం ప్రవాహానికే :** పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే 50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామార్థ్యం. 2022లో లెక్కలు కట్టిన నీటి ప్రవాహం 24.88 లక్షల క్యూసెక్కులు. నమోదైన ప్రవాహం పోలవరం సామర్థ్యంతో పోల్చుకుంటే సగమే. అప్పుడు భద్రాచలంలో నమోదైన నీటి మట్టం 71.3 అడుగులు. గోదావరి పరివాహక ప్రాంతం చాలా వరకు జలదిగ్బంధంలో ఉండిపోయింది. 2022 నాటి వరదల కంటే ఎక్కువ వరదలు వస్తే పరిస్థితి ఏంటీ నేది ఇప్పుడు ప్రజల్లో మెదులుతున్న ప్రశ్న. ఇంత ఘోర విపత్తు ఉందనే భయం ప్రజలను వెంటాడుతున్నప్పటికీ ప్రభుత్వాలు వాస్తవిక శాస్త్రీయ లెక్కలను కట్టి వెల్లడించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇకనైనా మౌనం వీడాలి :** ఇప్పటికైనా కేంద్రంతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మౌనం వీడాలి. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై సమగ్ర హైడ్రాలిక్ అధ్యయనం చేపట్టి భద్రాచలానికి వాస్తవంగా ఏ మేరకు ముప్పు ఉంది. ఏఏ ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎంత వరద ప్రవాహానికి ఎంత నీటి మట్టం నమోదవుతుంది అనే వివరాలు ప్రజల ముందు ఉంచాలని పలువురు కోరుతున్నారు.

# హరిత భవన్‌తో ఖమ్మంకు కొత్త శోభ

(మొదటిపేజీ తరువాయి)
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖాధికారులు లకారం పార్కు పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఆధునిక హోటల్ ప్రణాళికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమగ్రంగా వివరించారు. ప్రతిపాదిత నిర్మాణానికి తొలుత హరిత హోటల్ అని పేరు పెట్టగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా దీనిని హరిత భవన్‌గా మార్చాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ. 40 కోట్ల నిధులు అవసరమని మంత్రికి వివరించారు. సంబంధిత ప్రతిపాదనలు వెంటనే రూపొందించాలని అవి అందిన వెంటనే పరిపాలన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయిస్తామని మంత్రి తెలిపారు. ఈప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో పర్యాటక సూపరింటెండెంట్ ఇంజనీర్ సరిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, కన్సల్టెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి జూపల్లికి మంత్రి తుమ్మల లేఖ...**
హరిత భవన్ నిర్మాణానికి సంబంధించి రూ. 40 కోట్ల నిధులను సత్వరమే మంజూరు చేయాలని సంబంధిత శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ ద్వారా కోరారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నియమించిన కన్సల్టెంట్ ఈ ప్రాజెక్టుకు తాత్కాలిక అంచనా వ్యయాన్ని రూ. 40 కోట్లుగా సమర్పించారని, ఇప్పటికే జిల్లా యంత్రాంగం హరిత భవన్ ఏర్పాటు కోసం ఐదు ఎకరాల భూమిని గుర్తించి కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. జిల్లాకు వచ్చే పర్యాటకులు, భక్తులు, వాణిజ్య సందర్శకులు, అధికారులకు ఈ భవన్ నాణ్యమైన వసతి కల్పించడంతో పాటు సదస్సులు, సమావేశాలు తదితర కార్యక్రమాలకు అత్యుత్తమ వేదికగా ఉపయోగపడుతుందని లేఖలో మంత్రి వివరించారు. జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని, టెండర్ల ప్రక్రియను చేపట్టి వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి తుమ్మల కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లా పర్యాటక రంగం మరింతగా వెలుగొందుతుందని అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

# ఫామ్ పాండ్లు, నీటి సంరక్షణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి) ఆదేశించారు. ఫామ్ పాండ్లు, భూ గర్భ జలాల పెరుగుదలకు, రైతులు సాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చిన్న పరిమాణంలోని ఫామ్ పాండ్లలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడం వల్ల ఖర్చులు అధికమయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్న నేపథ్యంలో ఉద్యాన రైతులకు ప్రాధాన్యతనిస్తూ ఎక్కువ మంది రైతులు ఫామ్ పాండ్లు ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. ఏఈవో తన క్లస్టర్‌లో ఫామ్ పాండ్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఉద్యానవన క్లస్టర్ అధికారులు తమ పరిధిలో కనీసం 300 ఫామ్ పాండ్ల లక్ష్యంతో పనిచేయాలని, వచ్చే మంగళవారం నాటికి 50 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులను గుర్తించి పనులు ప్రారంభించాలన్నారు. విబి జి రాం జీ పథకం క్రింద సోక్ పిట్ల నిర్మాణ లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఐదు కమ్యూనిటీ సోక్ పిట్లు నిర్మించాలని తెలిపారు. ఆగస్టు 15 లోపు అన్ని నీటి సంరక్షణ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా వర్షపాతం, ప్రస్తుత సాగు పరిస్థితులు, పంటల నమూనాలను సమీక్షించిన కలెక్టర్ రైతులు పత్తిలో మిశ్రమ, అంతర పంటల సాగు వలన అధిక ప్రయోజనం ఉంటుందనే సందేశాన్ని విస్తృతంగా చేరవేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే వరి, పత్తి పంటలు వేయవద్దని తెలియజేయాలని, స్వల్ప కాలిక పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. కంది, పెసర, చిరు ధాన్యాలు వంటి పంటల సాగుపై దృష్టిపెట్టాలని సూచించారు. ప్రతి వారం నీటి సంరక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, ఆత్మ పిడి సరిత, ఉద్యాన వన అధికారిణి అనిత, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు, ఏఈవోలు, ఉద్యాన వన క్లస్టర్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సన్నకారు రైతులకు త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** సన్నకారు, చిన్న రైతులకు తక్షణమే త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డీడీలు చెల్లించి చాలా కాలం గడిచినా రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ముర్రం వీరభద్రం, కొమరం దామోదర్, సర్పంచులు కల్లూరి ఆదినారాయణ, పోడియం సుబ్బారావు, కుర్సం రవి, వర్స ముద్దరాజు, తునిక కామేష్, తెల్లం రాజేష్, సోందె నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# బీడు భూములుగా మారుతున్న పొలాలు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోనిరో ఎల్ ని నో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల వలన కల్లూరు మండలంలో కరువు చాయలు ఏర్పడుతున్నాయి. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, తెలగవరం, మర్లపాడు, పోచవరం, వెన్నవల్లి, తాళ్లూరు వెంకటాపురం, పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల, ఎర్రబోయినపల్లి, చండ్ర పట్ల, రఘునాథగూడెం తదితర గ్రామాలలో వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయం అనుకూలంగా ఉండే పొలాలు ఈ సంవత్సరం బీడు భూములుగా మారుతున్నాయి. గత సంవత్సరం ఈ సమయంలో ఈ సీజన్లో వరి నాట్లు పూర్తి కావచ్చాయి. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వలన బీడు భూములుగా మారుతున్నాయి. ఈ సంవత్సరం చెరువులు, కుంటలు, నేల బావులు, బోరుబావుల కింద మొత్తం 13 వేల ఎకరాలలో మాత్రమే వరి సాగు అయ్యే అవకాశం ఉంది. మిగతా భూముల్లో పంటలు సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. జూన్ నెలలో సాధారణంగా పడిన వర్షాలు అనుకూలంగా ఉన్న జులై నెలలో 15 రోజులు గడిచిన కూడా నేటికీ చుక్క నీరు వర్షం పడనందున అన్ని విధాలుగా పంటలకు సాగుకు ప్రశ్నార్ధకంగా మారింది. వచ్చిన గోదావరి జలాలతో కుంటలు, చెరువులు, కాలువల ద్వారా ఒక నెలకు మాత్రమే సరిపోయే అవకాశం ఉన్నందున మిగతా రోజుల్లో పరిస్థితి ఏమిటి అని రైతుల్లో చర్చ మొదలైంది. దీంతో రైతులు దిగాలు పడుతున్నారు. పగటి పూట అధిక ఉష్ణోగ్రత వలన చెరువులు కుంటల్లో వ్యవసాయ బావులు బోరుల్లో నీరు ఆవిరిగా మారి నీటి శాతం తగ్గిపోతోంది. భూమిలో తేమ శాతం కూడా తగ్గిపోవడం వలన పంటల సాగు ప్రశ్నార్ధకంగా మారింది. ఈ సంవత్సరం పంటలు దిగుబడి ఉమ్మడి జిల్లాలో కల్లూరు వరి ప్రధమంగా ఉన్న ఈ సంవత్సరం తక్కువ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో ప్రతి సంవత్సరం సాగర్ ఆయకట్టు పరిధిలో 33,000 ఎకరాలలో వరి పంట కొనసాగుతూ ఉంటుంది కానీ ఈ సంవత్సరం అందుకు భిన్నంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుందని వివరిస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ అధికారి ఎం రూప వివరిస్తూ వర్షాభావ పరిస్థితుల వలన ఆరుతడి పంటలు మూడు నెలల్లో వచ్చే పంటలు వేసుకొని రైతులు సాగు చేసుకోవాలని రైతులను వ్యవసాయ శాఖ అధికారి కోరారు.

# గుట్కాతో ప్రాణాలకు ముప్పు..!

(మొదటిపేజీ తరువాయి)
పాన్ మసాలా, జర్దా, తంబాకు కనిపించడం సాధారణమైపోయింది. ఇవన్నీ పొగలేని పొగాకు( స్మోక్‌లెస్ టొబాకో) ఉత్పత్తులే అయినప్పటికీ, సిగరెట్ కంటే తక్కువ ప్రమాదకరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణం గుట్కాలో అనేక రకాల క్యాన్సర్ కారక రసాయనాలు ఉంటాయి. దీర్ఘకాలం గుట్కా నమలడం వలన నాలుక, బుగ్గలు, చిగుళ్లు, గొంతు వంటి భాగాల్లో క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న నోటి క్యాన్సర్లలో దాదాపు 90% పొగాకు వినియోగం వల్లే సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మొదట కనిపించే లక్షణాలు ఇవే గుట్కా అలవాటు కారణంగా నోరు సరిగా తెరుచుకోకపోవడం, బుగ్గల లోపలి చర్మం గట్టిపడటం, తినడం, మాట్లాడడం ఇబ్బంది మారడం వంటి లక్షణాలు క్యాన్సర్‌కు తొలి హెచ్చరికలుగా భావిస్తారు. అలాగే పళ్లు నల్లగా లేదా ఎర్రగా మారడం, చిగుళ్ల దెబ్బతినడం, నోటి దుర్వాసన, పళ్లు ఊడిపోవడం, నోటిలో తెల్లటి మచ్చలు(ల్యూకోప్లాకియా) కనిపించడం వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

**గుట్కాకు దూరంగా ఉండండి: డాక్టర్ హర్షం**



ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ హర్ష మాట్లాడుతూ యువత గుట్కా, తంబాకు, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇవి శరీరాన్ని నెమ్మదిగా నాశనం చేస్తాయి. ముఖ్యంగా నోటి, గొంతు క్యాన్సర్లకు గుట్కా ప్రధాన కారణం. ఇటీవల చిన్న వయసులోనే క్యాన్సర్ బారిన పడుతున్న వరి సంఖ్య పెరుగుతుంది. ప్రాణాంతక వ్యాధుల బారిన పడకముందే యువత ఈ అలవాట్లను పూర్తిగా మానుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడం ద్వారా కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని సూచించారు.

# ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/అశ్వాపురం :** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి త్వరలో జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశంలో నేపథ్యంలో ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని బీజీ కొత్తూరులో హెలిప్యాడ్ పనులు, అమ్మగారిపల్లిలో సమీక్షా సమావేశ ప్రాంగణాన్ని పరిశీలించి భద్రత, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ సూర్యప్రకాష్, నీటిపారుదల, ఆర్అండ్‌బి తిదతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

**ప్రజాపక్షం/పాల్వంచ :** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యమని టిజిఎన్‌పిడిసిఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ టి. మధుసూధన్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలో విద్యుత్‌శాఖ పనితీరుపై కేటిపిఎస్ జెన్‌కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్, ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్, డిపిఈ, అకౌంట్స్ తదితర విభాగాల పనితీరును,33కేవి, 11 కేవి ఫీడర్ల ట్రిప్పింగ్, బ్రేక్‌డౌన్‌లు, లైన్ల నిర్వాహణ అంతరాయాల నివారణ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గించే చర్యలు, నెలవారీ నిర్వాహణ, ఓవర్ లోడింగ్ నివారణ, అవసరమైన ప్రదేశాలలో అదనపు డిటిఆర్‌ల ఏర్పాటు తదితర విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. మహీధర్, డీఈలు నందయ్య, శ్రీరంగస్వామి, జీవన్ కుమార్, వెంకటేశ్వర్లు ( ఎంఆర్‌టి ) వెంకటేశ్వర్లు డిపిఈ, ఎస్ఏఓ శ్రీధర్, ఏడీఈలు, ఏఈలు, ఏఏఓలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పర్ణశాలలో శ్రీసీతారాముల కళ్యాణం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వక్షేన పూజ, పుణ్యాహవాచనం, యజ్ఞోపవీత ధారణ, కంకణ ధారణ, ప్రవర్లు, మధుపర్కాలు, మహాసంకల్పం, మంగళాష్టకాలు, జీలకర్ర, బెల్లం, మాంగల్య పూజ, మాంగల్యధారణ తదితర శాస్త్రోక్త క్రతువులను వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమాన్ని దేవాలయ అర్చకులు కిరణ్‌కుమార్ చార్యులు, నరసింహా చార్యులు , ఆలయ సిబ్బంది శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ సీతారాముల దివ్య కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.

## పోడు భూముల జోలికి వస్తే సహించం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం పెద్ద బండిరేవు గ్రామంలో పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులను అటవీ శాఖ వేధించడం తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. పోడు భూముల్లో విత్తనాలు వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ప్రకారం అర్హులైన గిరిజనులకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని, సాగు భూముల జోలికి వస్తే సహించబోమని ఫారెస్ట్ అధికారులను హెచ్చరించారు. చర్ల మండలం కొండివాయి ప్రాంతంలోని పోడు సాగుదారులకు కూడా హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే టీఏజీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, టీఏజీఎస్ మండల కార్యదర్శి సరియం కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మర్మం చంద్రయ్య, కార్యదర్శి సోయం వీర్రాజు, నాయకులు పాయం హరిబాబు, సోయం కనకారావు, నూప ధర్మయ్య, పర్శిక లక్ష్మయ్య, పూణెం సమ్మక్క, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/కరకగూడెం:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 313 విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ మహిళా టైలర్ లకు అందచేసిన మెరూన్ కలర్ క్లాత్ తో కుట్టిన ఏకరూప దుస్తులు ను విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో మండల విద్యా శాఖాధికారి జి మంజుల, సెర్ప్ ఎపిఎం బి. వినోద్ క్రాంతి, విద్యాలయం ఇంచార్జి ప్రత్యేక అధికారి నసీమా, ఇంటర్ విద్యాధికారి సంధ్యారాణి, విద్యాలయం సిబ్బంది సెర్ప్ మహిళా టైలర్ లు శ్రీదేవి, స్ఫూర్తి, కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలో మండల వ్యవసాయ అధికారి ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాల మేరకు వివిధ ఎరువుల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం పంపించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువుల వ్యాపారులకు పలు సూచనలు జారీ చేశారు. రైతులకు ఎరువులను ముద్రిత గరిష్ఠ చిల్లర ధర కంటే అధిక ధరలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ప్రతి ఎరువుల విక్రయానికి సంబంధించి రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, స్టాక్ మరియు విక్రయాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీలర్లకు ఆదేశించారు. రైతులు కూడా ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు.

## పీఆర్సీ అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు



**ప్రజాపక్షం/కూసుమంచి:** తెలంగాణ రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన ఆయన, జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్యతో కలిసి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు రెండో పీఆర్సీ, డీఏలు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, రాజు, వీరబాబు, జుబేదా బేగం, యాదగిరి, చారి, పాషా, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలు వేగవంతం చేయాలి

**-జిల్లా కలెక్టర్ అంకిత్**







**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పర్యటించారు. ఈ పర్యటనలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సర్వే, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. తిప్పనపల్లిలో భూసేకరణ సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మద్దుకూరులో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను ఎన్నికల సంఘం గడువులోగా పూర్తి చేసి, ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించాలని సూచించారు. చంద్రుగొండ జెడ్‌పిహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో మధు, తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో అశోక్, ఇరిగేషన్ సర్వే శాఖ అధికారలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ గిరిజన సమాఖ్య

## రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయండి

**గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సొందే కుటుంబరావు**




**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 18, 19 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సమైక్య మూడవ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలను గిరిజన సమైక్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు పిలుపునిచ్చారు. సోమవారం బూర్గంపాడు మండల గిరిజన సమైక్య మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ లో ముఖ్యఅతిథిగా జరిగిన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కుటుంబరావు హాజరై మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్నటువంటి ప్రధాన సమస్యలపై ఈ గిరిజన సమైక్య రాష్ట్ర మహాసభలో చర్చించనున్నామని, రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై గిరిజనుల జీవనాధారంగా ఉన్న పోడు భూములకు పట్టాలివ్వాలని, అటవీ బంజర మిగులు భూములను పొంచాలని, ఇండ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు ఇవ్వాలని, అర్హులైన ప్రతి గిరిజనెలకి ట్రైకర్ రుణాలు అందించాలని, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అర్హులైనటువంటి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, విద్య వైద్యం విద్యుత్తు, రహదారులు, వంతెనలు తాగు నీరు, సాగునీరు సౌకర్యాలు కల్పించాలని, జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించాల, ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని తదితర డిమాండ్స్ తోటి ఈనెల 18, 19 తేదీల్లో 18వ తేదీన పాల్వంచ పట్టణంలో భారీ ప్రదర్శన, మరియు బహిరంగ సభ నిర్వహించనున్నామని, 19 వ తేదీన లారీ ఓనర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ బీసీఎం రోడ్ పాల్వంచలో ప్రతినిధుల మహాసభ జరగనుందని, కావున ఈ మహాసభలకు పినపాక నియోజకవర్గం నుండి ప్రతి మండలం నుండి ,గ్రామాల నుండి పెద్ద ఎత్తున గిరిజనులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గిరిజన సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, రాష్ట్ర గిరిజన నాయకులు, జిల్లా గిరిజన సమైక్య నాయకులు పాల్గొననున్నారని, కావున పెద్ద ఎత్తున గిరిజనులు ఈ మహాసభలో హాజర కాగలరని విజ్ఞప్తి చేశారు.

**బూర్గంపాడు మండల నూతన కమిటీ ఎన్నిక....**

నూతన కమిటీ కార్యదర్శిగా కుంజ బద్రు అధ్యక్షులుగా ఎట్టి బద్రు, ఉపాధ్యక్షులుగా, కొమరం రాజేష్ సహాయ కార్యదర్శిగా కుంజా నాగ రాజు కమిటీ సభ్యులుగా జోగయ్య సోమయ్య, సోనీ, రమేష్, దేవలను ఎన్నుకున్నారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, గిరిజన సమైక్య జిల్లా ఉపాధ్యక్షులు, బాడిషా సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వజ్జా వెంకటేశ్వర్లు, మండల నాయకులు కనితి సత్యనారాయణ, మండల నాయకులు, గారబోయిన నరేష్, కన్నెబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు ఉపయోగపడే విజ్ఞాన కేంద్రాలు ఎక్కడ..?




**ప్రజాపక్షం/కరకగూడెం:** విజ్ఞాన భాండాగారాలుగా ఉండాల్సిన గ్రంథాలయాలు, చరిత్రను తన పేజీల్లో పదిలంగా దాచుకున్న గ్రంథాలయాలు మండలంలో ఒక్కటి కూడా లేదు. అనేక ఉపయోగాలు ఉన్న గ్రంథాలయం జ్ఞానాన్ని వ్యాప్తి చేస్తుంది. పేద ప్రజలు, ముఖ్యంగా పేద విద్యార్థుల పుస్తకాలు కొనుగోలు చేయలేని పరిస్థితి, లైబ్రరీ యొక్క ఉత్తమ ఉపయోగం పొందవచ్చు. పుస్తకాలు తీసుకొని జ్ఞానం సేకరించవచ్చే గొప్ప సంపన్న వర్గం వారైన అన్ని పుస్తకాలను కలిగి ఉండరు లైబ్రరీపైనే ఆధారపడవలసి ఉంటుంది. రచయితలు, కవుల నుంచి పుస్తకాలను కొనుగోలు చేసి పాఠకులకు అందించవలసిన గ్రంథాలయ వ్యవస్థ చాలాకాలంగా వెనుకంజలో ఉంది. జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను మొక్కుబడిగా నిర్వహించడం తప్పింది. కొత్త పుస్తకాలను గ్రంథాలయాలకు రప్పించడంలో అధికా రులు, పాలకులు విఫలమవుతున్నారు. కనుక లైబ్రరీ ఏర్పాటు కొరకు కృషి చేయవలసిందిగా రచయితలు, కవుల నుంచి పుస్తకాలను కొనుగోలు చేసి పాఠశా లకు అందించవలసిన గ్రంథాలయ వ్యవస్థ చాలాకా లంగా వెనుకంజలో ఉంది. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మొక్కుబడిగా నిర్వహించడం తప్పించి, కొత్త పుస్తకాలను గ్రంథాలయాలకు రప్పించ డంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు.

**గ్రంథాలయం ఏర్పాటు చేయాలి...**

**బాడిశ సువాష్, (ఎస్ఎస్ఎఫ్) యూత్ విద్యార్థి నాయకుడు**



మండల కేంద్రంలో చదువుకుంటున్న పేద విద్యార్థి, విద్యా ర్థులకు, నిరుదోగ్యులకు గ్రంథాలయం ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని గ్రంథాలయ ఏర్పా టుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.

**గ్రంథాలయంతో ఎంతో మేలు :**

**గోగు సాయి, (ఎస్ఎస్ఎఫ్) జిల్లా యూత్ విద్యార్థి లీడర్...**



గ్రంథాయలంతో ఎంతో మేలు కలుగుతుందని, అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులకు వారి ఉజ్వల భవిష్యత్తు ఎదుగు దలకు ప్రధానంగా ఉపయోగప డుతుందన్నారు. గ్రంథాలయం ఏర్పా టుపై రేగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళ జీవన పోరాటం..!

**-ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న భర్త**
**-ఆటో స్టీరింగ్ పట్టిన భార్య**
**-కుటుంబం కోసం నిత్యం శ్రమిస్తున్న రావేలి**







**ప్రజాపక్షం/వైరా:** ఒక ప్రమాదం.. ఆ కుటుంబం జీవితాన్ని ఒక్కసారిగా మార్చేసింది. ఎంతో సంతోషంగా కుటుంబానికి అండగా నిలిచిన భర్త మంచాన పడిపోయాడు. రేపటి గురించి తెలియని ఇద్దరు చిన్నారులు కళ్లలో కన్నీళ్లు ఇంటి నిండా నిశ్శబ్దం. అలాంటి సమయంలో కుంగిపోకుండా, కన్నీళ్లను గుండెల్లో దాచుకొని కుటుంబానికి తానే ఆధారంగా నిలిచింది. ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన ఆదూరి రావేలి. రావేలి భర్త ఆదూరి రాధాకృష్ణ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాని పోషించేవారు. ఇద్దరు కుమార్తెలను ఉన్నతంగా చదివించి మంచి జీవితాన్ని ఇవ్వాలన్నదే ఆ దంపతుల కల. కాని విధి వారి కలలను ఒక్క క్షణంలో ఛిద్రం చేసింది. జరిగిన లారీ ప్రమాదంలో రాధాకృష్ణ ఒక కాలును కోల్పోయి మంచానికే పరిమితమయ్యారు. కుటుంబానికి ప్రధాన ఆదాయం ఒక్కసారిగా ఆగిపోయింది. ఆ క్షణం నుంచి రావెలి జీవితమే మారిపోయింది. భర్తకు ధైర్యం చెప్పాలి పిల్లలను చదివించాలి ఇంటిని నడపాలి. చివరకు కుటుంబం ఆకలితో అలమించకూడదనే ఒక్క ఆలోచనతో ఆమె ఆటో స్టీరింగ్ పట్టింది. తెల్లవారుజాము నుంచే ఆటో నడుపుతూ దొరికిన సమయాల్లో మార్కెట్‌లో పండ్లు అమ్ముతూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో ఇంటిని నెట్టుకొస్తుంది. రోజం తా శ్రమించి ఇంటికి చేరుకున్న తర్వాత కూడా కూడా ఆమెకు విశ్రాంతి ఉండదు. మంచాన పడ్డ భర్తకు సేవలు చేయాలి. పిల్లల చదువులు చూసుకోవాలి. మరుసటి రోజు కుటుంబం ఎలా గడుస్తుందో ఆలోచించాలి. అయినా ఆమె ముఖంపై ఓటమి కనపించదు. తన ఇద్దరు కుమార్తెల చదువే తనకు బలం వారి భవిష్యత్తే తన లక్ష్యమని చెబుతుంది. అయితే భర్తకు ఇప్పటివరకు ఎలాంటి పెన్షన్ గాని, సరైన ప్రభుత్వ సహాయం గాని అందకపోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థికి ఇబ్బందులు ఎదుర్కొంటుంది. వైద్య ఖర్చులు, పిల్లల విద్య, నిత్యవసరాల భారం రోజురోజుకు పెరుగుతుంది. అయినప్పటికీ అప్పుల కంటే ఆత్మ గౌరవాన్నే నమ్ముకొని రావేలి తన కష్టార్జితంతో కుటుంబాన్ని నిలబెడుతుంది. ఒక తల్లి, ఒక భార్య, ఒక మహిళ ఎంతటి కష్టాన్నైనా చిరునవ్వుతో భరించి కుటుంబం కోసం ఎంత దూరమైనా నడవగలదే విషయానికి ఆదూరి రావేలి జీ2వితం నిలువెత్తు నిదర్శనం. ఆమె పోరాటం కేవలం ఒక కుటుంబం కథ కాదు...జీవితంతో పోరాడుతున వేలాది మహిళల ఆత్మస్థైర్యానికి ప్రతిరూపం. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ధాతలు స్పందించి ఈ కుటుంబానికి చేయూతనిస్తే...ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు వెలుగులు నిండే అవకాశం ఉంది. ఒక చిన్న సహాయం...ఒక కుటుంబానికి కొత్త ఆశను అందించగలదు.

## జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలు చేయాలి

**-టీయూడబ్ల్యూజే(ఐజేయూ)పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ తప్పని సరిగా అమలు చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు జేవి రత్నం ఆదేశాల మేరకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ)ప్రతినిధులు మండల విద్యాశాఖ అధికారి యెదు సింహారాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్ల జోషి మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలుకావాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ఫీజు రాయితీ అందేలా విద్యాశాఖ పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. వినతిపై స్పందించిన మండల విద్యాశాఖ అధికారి యెదు సింహారాజు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసేందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. త్వరలోనే మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు డొంకన చంద్రశేఖర్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ మెంబర్ నరసింహారెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు శివకుమార్, ఎలక్ట్రానిక్ మీడియా ఈసీ సభ్యులు రవి, సభ్యులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, డి శ్రీనివాస్, కోటా రమేష్, రాంబాబు, చేతుల శ్రీనివాస్, సుధాకర్, ముజఫర్, కేసు పాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీఅద్భుత లక్ష్మీతాయారు అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు

**-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వేలాది భక్తులు**





**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు మండలం రేపల్లెవాడ, నాచారం గ్రామాల మధ్య గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ అద్భుత లక్ష్మి తాయారు అమ్మవారి 24వ తిరునక్షత్ర వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు మేలకొలుపు, సుప్రభాత సేవ, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం 108 కలశాలతో అభిషేకం, పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించి ఆలయాన్ని మామిడి తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాల మధ్య భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ ప్రాంగణంలో పలువురు దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి తిరునక్షత్ర వేడుకలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రాఘవాచార్యులు, శ్రీమన్నారాయణాచార్యులు, లక్ష్మణ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో కళ్యాణ లక్ష్మి పథకం కింద ఏడుగురు లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఒక్కో లబ్దిదారునికి రూ 1,00,116 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మండల తహసీల్దార్ గడ్డం ఉమారాణి, డీటీ బాధావత్ భద్రు, ఆళ్లపల్లి సర్పంచ్ వాసం సుష్మితతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు మర్కోడు సుతారి రామాదేవి, రామాంజిగూడెం మోకాళ్ల చంద్రశేఖర్, ఆనంతోగు కల్తీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు ఎండీ అతహర్, పాయం సత్యనారాయణ, పానుగంటి మంగ, తాళ్లపల్లి కృష్ణ, సుతారి కృష్ణ, ఉల్లోజు భరత్, సాయి, తాళ్లపల్లి చిరంజీవి, శ్రీరామ్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లపాడు పనులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో జరిగిన మిత్రపక్షాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వర్షాభావంతో వరి నారుమళ్లు ఎండిపోతున్నాయని, మారెళ్లపాడు, తుమ్మలచెరువు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించకుండా ఇతర ప్రాంతాలకు మళ్లించడం సరికాదన్నారు.ఈ అంశంపై డీఈకి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. అనంతరం నాయకులు మొండికుంట గ్రామంలోని ఎండిపోతున్న వరి నారుమళ్లను పరిశీలించారు. నేడు బీజీ కొత్తూరు సమీపంలోని సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్‌ను సందర్శించినున్నందున ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో రైతు సంఘం నాయకులు స్వర్గం బాలనర్సయ్య, బద్దం శాంబిరెడ్డి, టీజేఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చావా రాఘవులు, తూము చిన్న రాఘవులు, మన్మథరెడ్డి, సీపీఐ నాయకులు దంతాల జగదీష్, దండి నాగేశ్వరరావు, స్వర్గం వీరరాఘవులు, తునికేసి సుధాకర్‌రెడ్డి, పగడాల అశోక్‌రెడ్డి, మంగి వెంకటరమణ, దండి రాములు, ఆవుల సుధాకర్, బొమ్మరాతి రామయ్య, మేర భాస్కర్, మామిడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఈనెల 18,19 తేదీల్లో పాల్వంచలో నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొందే కుటుంబరావు పిలుపునిచ్చారు. అశ్వాపురంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు, అటవీ భూముల పంపిణీ, ఇండ్ల స్థలాలు, ట్రైకర్ రుణాలు, మౌలిక సదుపాయాలు, ఇందిరమ్మ ఇళ్లు, జీఓ 3 పునరుద్ధరణ, ఏజెన్సీ డీఎస్సీ తదితర గిరిజన సమస్యలపై మహాసభలో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. 18న పాల్వంచలో భారీ ర్యాలీ, బహిరంగ సభ, 19న ప్రతినిధుల మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ పినపాక నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు హాజరుకావాలని తెలిపారు. ఈసందర్భంగా అశ్వాపురం మండల గిరిజన సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లూరి నరసింహారావు, సహాయ కార్యదర్శిగా కంగాల నరసింహారావు ఎన్నికయ్యారు. అనంతరం మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, మేళపురి సురేందర్‌రెడ్డి, గిరిజన సమైక్య జిల్లా ఉపాధ్యక్షుడు బాడిశా సతీష్, జిల్లా కమిటీ సభ్యుడు వజ్జా వెంకటేశ్వర్లు, కనితి సత్యనారాయణ, రాయపూడి రాజేష్, గారబోయిన నరేష్, కన్నెబోయిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కరోనా సమయంలో నిలిచిన రైళ్ల పునరుద్ధరణకు చర్యలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కరోనా సమయంలో నిలిపివేసిన పలు రైళ్లను తిరిగి ప్రారంభించాలని స్థానికులు చేసిన విజ్ఞప్తిపై సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేజేనర్(డీఆర్ఎం)డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం సింగరేణి మండల కేంద్రంలో కారేపల్లి రైల్వే స్టేషన్‌ను డీఆర్ఎం సందర్శించారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో డోర్నకల్, కొత్తగూడెం మార్గంలో నడిచిన పలు రైళ్లను కరోనా సమయంలో రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఆర్ఎం, ప్రయాణికుల సమస్యలను పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించిన డీఆర్ఎం, అందుబాటులో ఉన్న వసతులను మరింత మెరుగుపరచాలని రైల్వే అధికారులకు సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి చేపడుతున్న రెండో రైల్వే లైన్ పనులను కూడా ఆయన పరిశీలించారు.

# యువత సమస్యల పరిష్కారానికి పోరుబాట

**- ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్**






**ప్రజాపక్షం/బోనకల్‌:** కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలకు ఇచ్చినప్పటికీ, ఆచరణలో విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దొజు శ్రావణ్ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మండల మహాసభను కలకోటలో మంగళవారం నిర్వహించారు. మహాసభ ప్రతీకగా ఏఐవైఎఫ్ యువజన సంఘ జెండాను మాజీ యువజన నాయకులు ఆకెన పవన్ ఎగురవేశారు. ముందుగా ఏఐవైఎఫ్ మాజీ నాయకులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబులు మాట్లాడుతూ యువజన సమస్య పరిష్కారానికి, విద్య, ఉపాధి హక్కుల సాధనకు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు, ప్రజాస్వామ్య, లౌకిక భారత నిర్మాణానికి కొత్త కార్యాచరణ అఖిల భారత యువజన సమాఖ్య అనునిత్యం పోరాడుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని యువజన సమస్యల పరిష్కారానికి పోరాటానికి సన్నద్ధమవ్వాలని కోరారు. అనంతరం చింతల రమేష్, మద్దొజు శ్రావణ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహిస్తూ శాశ్వత ఉద్యోగ అవకాశాలను కుదిస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ, నియామకాలలో జాప్యం, విద్యా, వైద్య రంగాల వాణిజ్యకరణ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయడం, ఎన్నికల హామీలను వేగవంతం చేయడం, ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయడంలో ఆశించిన పురోగతి సాధించలేదని విమర్శించారు. ఈ మహాసభలకు యువజన నాయకులు, బాధ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, మదుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర నాని, సంఘం నాయకులు కోసూరి అభి, వంగాల ఆంజనేయులు, జక్కుల నిఖిల్, సిహెచ్ రాజ్‌కుమార్, మాతంగి వినయ్, వంగాల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అభి, ఆంజనేయులు ఏకగ్రీవ ఎన్నిక...




అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బోనకల్ గ్రామానికి చెందిన కోసూరి అభి, మోటమర్రి గ్రామానికి చెందిన వంగాల ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కలకోటలో ఏఐవైఎఫ్ మండల మహాసభను విజయవంతంగా ముగిసింది. ఈ మహాసభలో వీరితో పాటు ఉపాధ్యక్షులుగా జక్కుల నిఖిల్, సహాయ కార్యదర్శి సిహెచ్ రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల శ్రీనాథ్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 22 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన కోసూరి అభి, వంగాల ఆంజనేయులు మాట్లాడుతూ యువత సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతామని తెలిపారు. నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేసి, వారి నాయకత్వంలో ఏఐవైఎఫ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లకు నియామక పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలను వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మల్లు నాయకత్వంలో విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను చిన్న వయస్సు నుంచే అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం ద్వారా చిన్నారుల్లో విద్యా పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు వారి మానసిక, సామాజిక, బావోద్వేగ, శారీరక వికాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, తేలూరి వీరయ్య, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగ్గురు అక్రమ గంజాయి రవాణాదారులు అరెస్ట్




**ప్రజాపక్షం/కల్లూరు:** గంజాయి మత్తుకు అలవాటు పడి సరఫరా చేస్తున్న కల్లూరు పట్టణానికి చెందిన షేక్ హబీబ్, బొడ్డు చందులు, మణుగూరుకు చెందిన తేజావత్ రమేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగం కల్లూర్ పోలీస్ స్టేషన్లో తెలిపారు. గత ఏడాది 2025 లో హబీబ్ అనే నిందితుడు స్నేహితులతో కలిసి ఒరిస్సా రాష్ట్రం నుండి సన్నీ అనే వ్యక్తి దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసి కల్లూరులో చిన్న ప్యాకెట్లు గా చేసి త్రాగే అలవాటు ఉన్నవారికి విక్రయిస్తుండగా అతనిని పట్టుకొని కేసు నమోదు చేసి తరలించినట్లు తెలిపారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కొద్దికాలం బాగానే ఉన్నా ఒక రెస్టారెంట్లో పనిచేస్తూ ఎటువంటి పని లేకపోవడం వలన మణుగూరు అత్త ఇంటికి వెళ్లినప్పుడు పాత స్నేహితుడైన తేజావత్ రమేష్ ను కలవగా ఇరువురు గంజాయి సేవించారని దాంతో మరల అలవాటు పడి కల్లూరు వచ్చిన తర్వాత గంజాయి కోసం బొడ్డ చందుని సంప్రదించగా చందు కొద్ది మొత్తంలో 500 రూపాయలకు ముద్దు నూరు లో తెచ్చి ఇచ్చాడని కానీ ధర ఎక్కువగా ఉండటం వలన గంజాయి తక్కువ రావడంతో హబీబ్ చందు లు మరలా ఒరిస్సా రాష్ట్రం వెళ్లి జులై 7న వాహనం ఏర్పాటు చేసినందుకు తేజావత్ రమేష్ గంజాయిలో వాటా అడగటంతో 500 గ్రాముల తేజావత్ రమేష్ కి ఇచ్చారని తెలిపారు. తర్వాత పేరువంచ గ్రామానికి చెందిన ప్రవీణ్ చిన్న ప్రవీణ్ హరీష్ లను సంప్రదించగా వారు ఒప్పుకున్నారని దాంతో తేజావత్ రమేష్ దగ్గర ఉన్న అరకేజీ కూడా తెప్పించి ముగ్గురు కలిసి మొత్తం మూడు కేజీలు అమ్మి మల్యసగిరి వెళ్లి మరల పెద్ద మొత్తంలో లాభాల దురుద్దేశంతో అభి చందు రమేష్ లో జూలై 13న బండి పై పేరు వంచ వెళ్ళుచుండగా పంచదార పరిశ్రమ వద్ద వాహనాల తనిఖీల భాగంగా కల్లూరు పోలీసులు పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. అట్టి గంజాయి విలువ ఒక కేజీ 50 వేలు చొప్పున మొత్తం మూడు కేజీలు 1,50,000 ఉంటుందని తెలిపారు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం తో పాటు ఎస్సై హరిత, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహారావు, లక్ష్మీ పత్తులు శ్రీనివాసరావు, సత్యనారాయణ, రఫీ, విజయ్ రంగారావులు సహకరించారు. ఈ సందర్భంగా వారిని సీఐ మరియు ఎస్సైలు అభినందించారు. గంజాయిని అక్రమ అక్రమంగా కొనుగోలు చేసిన రవాణాకు పాల్పడిన విక్రయించిన సేవించిన నేరమని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కఠిన చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

# గురుకుల కళాశాలను తనిఖీ చేసిన కమిషనర్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని బాలికల గురుకుల కళాశాలను కల్లూరు కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సంక్షేమ వసతి గృహంలో మౌలిక వసతులు పరిశుభ్రత పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని కళాశాల ప్రిన్సిపల్ కనకదుర్గ ను ఆదేశించారు. తనిఖీల లో భాగంగా భోజన శాల, డ్రైనేజీ, ఆటలు సురక్షితమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కనకదుర్గ గురుకుల కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిజి20 రన్నర్స్‌కు ఘన సన్మానం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణలో యువ క్రికెటర్ల నైపుణ్యాల ప్రదర్శనకు వేదికగా నిలిచిన టిజి 20 క్రీడల్లో రన్నర్స్‌గా నిలిచిన అన్విత ఖమ్మం ఎసెస్ జట్టును ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఛైర్మన్ గుండాల కృష్ణ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నందిని విక్రమార్క మల్లు అతిథులుగా పాల్గొని క్రీడాకారులను సత్కరించి అభినందనలు తెలిపారు. తొలి సీజన్‌లోనే టోర్నీ ఆరంభం నుండి అద్భుత ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరుకున్నారని రానున్న సీజన్‌లో తప్పకుండా విజయం సాధించి ఖమ్మం కీర్తిని చాటుతారని గుండాల కృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. జట్టులోని సభ్యులంతా తమ వంతు పాత్ర పోషించి రన్నర్స్‌గా నిలవడంలో కృషి చేశారని నందిని విక్రమార్క మల్లు తెలిపారు. కళలు, క్రీడలను ప్రోత్సహించడంలో ఖమ్మం జిల్లా ముందుంటుందని దానికి నిదర్శనమే నేటి ఈ విజయమని వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రన్నర్స్‌గా నిలిచి ఖమ్మం జిల్లా ప్రజల అదరాభిమానాలను ఖమ్మం జట్టు సభ్యులు పొందగలిగారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జట్టు కెప్టెన్ ఛామా వజ్రేంద మిలింద్, సహేంద్ర విక్రమాదిత్య మల్లు తో పాటు జట్టు సభ్యులంతా రాణించి ఈ ఘనత సాధించారన్నారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జట్టు హెడ్ కోచ్ అభిజిత్ ఛటర్జీ, టీమ్ మెంబర్ హరిమోహన్, జట్టు ఫ్రాంచైజ్ ఓనర్ గోపన్న అచ్యుతరావు, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మధిర పట్టణానికి చెందిన పలువురు లబ్దిదారులకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలుపుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అర్హులైన ప్రతిఒక్కరికి ఆర్థిక సహాయం అందేలా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, కాంగ్రెస్ నాయకులు షేక్ జహంగీర్, కోట దేవిడ్, నకిరికంటి గోవింద్, మోదుగు బాబు, సబ్బ ప్రసాద్, సాలిక సురేష్, రంజిత్ సాహు పాల్గొన్నారు.

# భూ రీ సర్వేను సమగ్రంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆర్‌డిఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కాకరవాయి గ్రామంలో ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో రైతులు పలు అనుమానాలను తెలపడంతో మంగళవారం ఖమ్మం ఆర్‌డిఓ శ్రీనివాసరావు రీ సర్వేని మళ్లీ పరిశీలించారు. ప్రతి రైతు తమ పట్టా భూముల సర్వేను క్షేత్రస్థాయిలో నిబంధనల ప్రకారం చేపట్టి భూయజమానుల సమక్షంలో సరిహద్దులను గుర్తించి ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వే ప్రక్రియలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి భూ రీ సర్వే కార్యక్రమాన్ని విజయంతం చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డిఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సుధీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాలువకు గండి..వృథాగా పోతున్న గోదావరి జలాలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలం గుట్టగూడెం గ్రామంలో చెరువు కాలువకు గండి పడటంతో గోదావరి జలాలు వృథాగా ప్రవహిస్తున్నాయి. గుట్టగూడెం చెరువు నుంచి తుమ్మకుంట చెరువుకు వెళ్లే కాలువకు గండి పడటంతో నీరు రైతుల పొలాల మీదుగా దిగువకు వెళ్లిపోతోంది. దీంతో సాగునీరు వృథా అవుతుందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గండిని పూడ్చి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

# తప్పుడు ప్రచారాలు చేసే ఛానళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- నాలుగున్నర దశాబ్దాలుగా మచ్చలేని నిజాయితీగల నాయకుడు కూనంనేని**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తప్పుడు ప్రచారాలు చేసే వార్తా చానళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఒక ఛానల్లో వచ్చిన వార్తలపై ఆయన మంగళవారం జిల్లా కేంద్రంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ గత నాలుగున్నర దశాబ్దాలుగా ఎలాంటి మచ్చ లేకుండా ప్రజల పక్షాన నిలబడి నిరంతరం శ్రమిస్తున్న నిజాయితీ గల నాయకుడు కూనంనేని అని కొనియాడారు. నిరాధారమైన ఆరోపణలతో ఇలాంటి తప్పుడు వార్తలను ప్రసారం చేయడం తగదని, కూనంనేని వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం శోచనీయం అన్నారు. మీనాక్షి నాటరాజన్‌కు తానేమి ఫిర్యాదు చేయలేదని ఎంపి రఘురామిరెడ్డి స్వయంగా ప్రకటించారని, చానళ్లలో తప్పుడు వార్తలు రావడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగుందని మండిపడ్డారు. ఇప్పటికైనా మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకుని బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

**కూనంనేనిపై ఆరోపణలను ఖండించిన ఎంపి రామసహాయం...**



కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుపై తాను కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రముఖ ఛానల్లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని, సదరు దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రాఘురామిరెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వార్త ఛానల్లో ప్రసారమైన వార్తపై మంగళవారం ఆయన వివరణ ఇచ్చారు. ఎంఎల్‌ఏ కూనంనేని ఇంసుక దందాలు, భూ కబ్జాలు చేస్తున్నారని తాను ఫిర్యాదు చేసినట్లు ప్రసారం చేయడంపై ఆయన తీవ్రంగా అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కేవలం కాంగ్రెస్ ఎంపిను పిలిపించి ఎస్‌ఐఆర్ ప్రక్రియ గురించి మాత్రమే వివరణ తీసుకున్నారని ఎంపి స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ ఎస్‌ఐఆర్ ప్రక్రియకుసంబంధించి వివరాలు సేకరించారని, అందులో భాగంగానే తాము కూడా పాల్గొన్నామని తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సాంధించిన విజయాల రిపోర్టు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే తాము మీనాక్షికి కూలంకుషంగా వివరించామని చెప్పారు. రాజకీయ లబ్ధికోసం ఇలాంటి తప్పుడు వార్తను ప్రసారం చేయించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సిపిఐ కాంగ్రెస్ కలిసికట్టుగా ఉన్నాయని తమ మధ్య ఎలాంటి విభేదలు లేవని రామసహాయం రఘురామిరెడ్డి స్పష్టం చేశారు.

# గిరిజన సమాఖ్య మహాసభలను జయప్రదం చేయండి




**- 18న మహా ప్రదర్శన, 19న ప్రతినిధుల సభ**
**- ప్రచార కరపత్రాలు విడుదల**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభల జయప్రథం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో మంగళవారం పట్టణ సమితి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రచారకరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జమలయ్య మాట్లాడుతూ గిరిజనుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల సాధనకై నిరంతరం పోరాడు తామని స్పష్టం చేశారు. ఈ నెల 18,19 తేదీల్లో పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) 3వ రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతాని చెప్పారు. మహాసభల తొలిరోజు భారీ ప్రదర్శన ఉంటుందని, రెండో రోజు ప్రతినిధుల సభ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో ఉంటుందన్నారు. ఈ పోరాట మహాసభల్లో గిరిజనులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రథం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెద్దాడు నగేష్, వెంకటేశ్వరావు, యూసుఫ్, నేరెళ్ల శ్రీను, కృష్ణ, వాడే రాములు, మండల రాజేశ్వరరావు, ఆజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ తీవ్రంగా విమర్శించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినూత్నంగా వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత 7ఏళ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.10814 కోట్ల స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. లేని పక్ష్యంలో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కనీసం మౌళిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన వాతావరణాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో ఏఎన్ఎంలను, వర్కర్లను పూర్తిస్థాయిలో నియమించాలని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల మూసివేతను తక్షణమే విరమించుకోవాలని ఇప్పటికైనా పాలకులు స్పందించి విద్యారంగ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించకపోతే విద్యార్థిలోకాన్ని ఏకం చేసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, కొత్తగూడెం పట్టణ నాయకులు రమేష్, విఘ్నేష్, ప్రసాద్, కళ్యాణి, మానస తదితరులు పాల్గొన్నారు .



# అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయలేరు..

**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి బయలుదేరి వెళ్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీని మరియు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అనిల్ కుమార్, అఖిల్ బాలాజీ వారిని కూడా ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు విడుదల చేయమని డిమాండ్ చేస్తే ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిల విడుదల కోసం పోరాటం నేరమా అని అన్నారు.



తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల కాక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని అక్రమ అరెస్టు చేసిన ఎన్ని చేసినా ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# కమలాపురం పెద్దయ్య చెరువుకు జలకళ

**-సీతారామ జలాలతో నిండుతున్న చెరువు, రైతుల్లో ఆనందం**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కమలాపురం శివారులోని పెద్దయ్య చెరువు గోదావరి జలాలతో జలకళ సంతరించుకుంది. సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ 3 నుంచి విడుదలవుతున్న నీరు ప్రధాన కాలువ, పాటివాగు మార్గంగా చెరువుకు చేరుతోంది. మరో రెండు రోజుల్లో చెరువు పూర్తి స్థాయిలో నిండిపోయి అలుగు పడే అవకాశం ఉందని రైతులు తెలిపారు. చెరువు నిండడంతో ఆయకట్టు భూములకు సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా చెరువుకు నీటి మళ్లింపుతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపారని రైతులు పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కల్తి పాపయ్య, కుంజా రామ్మూర్తి, బాల అప్పారావు, గుగ్గిల ఆదినారాయణ, సుగ్గల విజయబాబు, గుడూరి నరసింహారావు, కుంజా ప్రమోద్, కల్తీ రామకృష్ణ, గొగ్గల నరేష్, గద్దె మధు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ ప్రతిపాదనలను విరమించుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కోల్ హ్యాండ్లింగ్, యాష్ హ్యాండ్లింగ్ ప్లా నిర్వాహణను ప్రవేటీకరణ చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.ప్లాంట్ల ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక కేటిపిఎస్ ఉద్యోగులు అంబేద్కర్ సెంటర్‌లో 18వ, రోజు నిరసనకు దిగారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రవేటు పరం చేస్తే ప్రజలపై అధిక ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల సామర్థ్యం, భద్రత మరియు ప్రజా ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, ఎస్‌కే. యాస్మిన్, ఉమా మహేశ్వరరావు, బ్రహ్మాజీ, రాజేష్, మహేష్, రఘువీర్, డోలి శ్రీనివాసరావు,కోటేశ్వరరావు, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యత కలిగిందని, ప్రతీ ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో సిపిఐ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని బస్తీల్లో మగంళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత బస్తీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన వారందరితో ఎస్‌ఐఆర్ ఫారాలను పూర్తి చేయించాల్సిన బాధ్యత ప్రతొక్కరిపై ఉందన్నారు. ప్రజా స్వామ్యంలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని అందుకే ఈ సవరణ ప్రక్రియను ఒక బాధ్యతగా చేపట్టాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులకు పూర్తిస్థాయిలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పార్టీ తరుపున ఎంపికైన బూత్ లెవల్ ఏజెంట్లు సంపూర్ణ సహకారం అందిచాలని పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు మార్పులు చేర్పుల ప్రక్రియను విజయవతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయులు ఎండి యూసుఫ్ బోయిన విజయ్‌కుమార్, కూరపాటి సుధాకర్ బండి నర్సింహా దుర్గయ్య ధనలక్ష్మి పండాల ఆకాంక్ష ఎం హరిత దాసరి శ్రీనివాస్ ఎర్రబెల్లి శంకర్ మునిగడపపద్మ కంచర్ల హిమశ్రీ పి సత్యనారాయణచారి పాల్గొన్నారు.


# విద్యార్థి ఉద్యమాలను అణచివేయొద్దు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన సచివాలయం ముట్టడి పిలుపును అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య విమర్శించింది. సచివాలయం ముట్టడికి వెళ్లకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయిను ముందస్తుగా అరెస్టు చేయడం ద్వారా విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల అంశంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాటలు మారుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. విద్యార్థుల న్యాయమైన పోరాటాలను అడ్డుకునే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.

# ఎదురెదురుగా రెండు లారీలు ఢీ..

**-క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని పడమటి నరసాపురం గ్రామం వద్ద మంగళవారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. తల్లాడ వైపునుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ, పాల్వంచ నుండి జగ్గయ్యపేట వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్ లు ఒకదాని కొకటి ఏదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు యస్ ట్యాంకర్ లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. లారీ డ్రైవర్ క్యాబిన్లోనే ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. సమాచారం తెలుసుకున్న జూలూరుపాడు పోలీసులు స్థానికుల సాయంతో క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్ ను బయటికి తీశారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన లారీలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కొత్తగూడెం, ఖమ్మం వేళ్ళు మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

# ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**-అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**
**-కలెక్టర్ దివాకర టీఎస్**



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. కూసుమంచి మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, బీఎల్ఓల పనితీరు. ఫారాల పంపిణీ, సేకరణ, డేటా నమోదు పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేయాలని, ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డిజిటైజేషన్ పనులను అదరపు సిబ్బంది సహాయంతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సహకారం అందించాలని తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, సూపర్వైజర్లు, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రేయస్సే ఎంప్లాయిస్ యూనియన్ ధ్యేయం

**- పాటి అప్పారావు, కందుల భాస్కర్, జీఎస్ నారాయణ**
**- టిఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ నుంచి భారీ చేరికలు**





**ప్రజాపక్షం/భద్రాచలం:** కార్మికల శ్రేయస్సే ఎంప్లాయిస్ యూనియన్ ఏకైక లక్ష్యమని టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐటియూసి అనుబంధ టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనిన్ జనరల్ బాడీ సమావేశం ఎన్‌వి కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేన పాటి అప్పారావుతో పాటు రాష్ట్ర కార్యదర్శులు కందుల భాస్కర్, జీఎస్ నారాయణ మాట్లాడుతూ కార్మిక హక్కులు, స,ంక్షేమం, శ్రేయస్సు కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పనిచేస్తుందన్నారు. రానున్న టిఎస్ ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఖచ్చితంగా విజయం సాధించనుందని తెలిపారు. కానీ యూనియన్ ఓడించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈయూ గెలిస్తే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసేంత వరకు ఉధ్యమిస్తామనివారికి తెలసని, ప్రభుత్వంలో విలీనం చేయడం పాలకులకు ఇష్టం లేదు కాబట్టే ఓడించేందుకు ప్రయత్నిస్తారని చెప్పారు. ఎవరి ఎన్ని కుట్రలు పన్నినా కార్మిక శ్రేయస్సుకు పాటు పడే ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధించడం ఖాయమన్నారు. యాజమాన్య కార్మిక వ్యతిరేక విధానాలను ఎప్పకప్పుడు నిలదీస్తూ కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాల సాధనంలో ముందుండి పోరాడుతామని చెప్పారు. నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ నుండి భారీగా ఎంప్లాయిస్ యూనియన్‌లో కార్మికులు చేరారు. వారికి యూనియన్ నాయకులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే ఈయూలో చేరడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు. అనంతరం డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్ష కార్యదర్శులుగా నారగట్ల విజయ్ కుమార్, బర్ల రమణారావుతో పాటు 21 మందితో నూతన కమిటీ కొలువు తీరింది. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా కార్యవర్గ సభ్యులు నోముల రామిరెడ్డి, ఏఐటియూసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్, ముధుసూధన్, ముగ్గం జేసు వాసు పచ్చిపాల రమేష్, బిఎస్ రావు, వీరబాబు ఉమా మహేశ్వరరావు జీవీలు సుధాకర్ ఉమారాణి పద్మావతి శైలజ సావిత్రి కృష్ణవేణితో పాటు సుమారు 100 మంది పాల్గొన్నారు.

# పోక్సో కేసులో దర్యాప్తు వేగవంతం చేయండి

**- పోలీసు కమిషనర్ సునీల్‌దత్**





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సిపి కార్యాలయంలో నిర్వహించిన నేరసమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరవిచారణలో నిందితులకు శిక్షల శాతం పెరిగేలా చూడలన్నారు. దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణతో పాటు ప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణిత గడువులోగా ట్రయల్ పూర్తి చేసి సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ న్యాయస్థానంలో హజరుపరచాలన్నారు. ఎన్డీపీఎస్ కేసులలో కోర్టులో నేరాన్ని నిరూపించేందుకు ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, మాదకద్రవ్యలను శాస్త్రీయంగా, ఫోరోన్సిక్ నివేధికలను ఆధారం చేసుకోవాలని సూచించారు. గంజాయి రవాణాను అరికట్టెందుకు టాస్క్‌ఫోర్స్, ఈగల్ టీమ్‌లు స్థానిక పోలీసుల సహకారంతో మూలలను కనిపెట్టి దాడులు చేసి నిందితులపై పిడియాక్ట్ నమోదు చేయాలన్నారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చోరీల కట్టడికి, వివిధ చోరీల్లో రికవరి చేసిన సోత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి సాంకేతికలను ఉపయోగిస్తూ ముందుకు సాగాలన్నారు. రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను గుర్తించి వారి నుంచి త్వరితగతిన సొత్తును స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రతి కేసును సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్, డిజిటల్ సాక్షాలను వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందే నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. శాంతి భద్రతలు, నేరాల దోరణి, పోలీస్‌స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యల నిర్మూలనకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సిపి సమీక్షంచి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన హాట్‌స్పాట్, బ్లాక్ స్పాట్‌ల వద్ద ఆర్అండ్‌బి అధికారుల సమన్వయంతో వేగ నియంత్రణ సూచిక బోర్డులు, స్పిడ్ బ్రేకర్లు, రేడియం స్టికర్లు , బ్లింకర్లు, కూడళ్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రిసమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు ఏర్పాటుతో పాటు వీధిదీపాలను మెరుగుపరచడం, రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి భోజా రామానుజం, ఏసిపిలు ఎస్‌వి రమణమూర్తి, తిరుపతిరెడ్డి, సారంగుల సారంగపాణి, సిహెచ్ ఆర్ వి ఫణిధర్, వసుంధర యాదవ్, నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నేత రఘుపతిరెడ్డి మృతి



**ప్రజాపక్షం/తల్లాడ:** ప్రభుత్వ అధికారిగా, సొసైటీ ఛైర్మన్‌గా, ఎంపీటీసీగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా సేవలందించిన దగ్గుల రఘుపతి రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు రఘుపతి రెడ్డి మరణం ప్రాంత ప్రజలకు తీరనిలోటని, నాయకులతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం సొసైటీ ఛైర్మన్‌గా ఆయన గెలుపొంది ప్రాంత ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. ఎంపీటీసీగా, సీనియర్ నాయకులుగా ఉండి ప్రజత సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఈ క్రమంలో ఆయన అంత్యక్రియలు తల్లాడలోని స్వగృహంలో బుధవారం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## దయానంద్‌ను కలిసిన సర్పంచ్ శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/తల్లాడ:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వైద్యుడు మట్టా దయానంద్‌ను మండల పరిధిలోని పాత పినపాక గ్రామ సర్పంచి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రం శ్రీనివాస్ మంగళవారం కలిశారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో తమ గ్రామ పరిధిలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. గ్రామంలో ఇంకుడు గుంతల సమస్య పరిష్కారంతోపాటు గ్రామాభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. స్పందించిన దయానంద్ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచి శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తేళ్లపుట్ట నాగేశ్వరరావు, నానయ్య, కృష్ణకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 26 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ. 9 లక్షలతో కొత్తపేట స్మశాన వాటికకు వెళ్లే రహదారి, రూ. 9 లక్షలతో మంచుకొండ ఎత్తిపోతల పథకంకు వెళ్లే రహదారి, రూ. 8 లక్షలతో శివాలయం దగ్గర స్మశాన వాటికకు వెళ్లే రహదారిని సిసి రోడ్లుగా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిసి రోడ్ల నిర్మాణానికి రూ. 26 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చడంతో పాటు గ్రామాభివృద్ధికి కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ క్యాక్రమంలో మూడ్ శంకర్, వెంకటనర్సయ్య, కుతుంబాక వెంకటేశ్వర్లు, పరిటాల ముత్తయ్య, అనంగుల సైదబాబు, దారవత్ హము, అరిపికట్ల ఆది నారాయణ, ఆవుల రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

## ఆదివాసి మహిళ భూమిని తిరిగి అప్పగించాలి

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం రెవెన్యూ కార్యాలయంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన భూమి వివాదంపై జిల్లా, రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి అసలు భూ యజమాని ఎవరో తేల్చాలని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక గౌరవ అధ్యక్షుడు కొమురం దామోదరరావు డిమాండ్ చేశారు. 1990 నుంచే ఓ ఆదివాసీ మహిళ పేరున ఉన్న భూమి గిరిజనేతరుల చేతుల్లోకి ఎలా వెళ్లిందో విచారణ చేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులు భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మించడం, చెట్లు పెంచి నరికి ఆర్థిక లాభాలు పొందడం వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. 2019లో జరిగిన పట్టా మార్పిడిపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భూమిని బాధిత ఆదివాసీ మహిళకు తిరిగి అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## మోదుగు ప్రభాకర్‌రావుకు సన్మానం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజెయు) సంఘం జిల్లా సభ్యుడిగా నియమితులైన ఆంధ్రప్రభ రిపోర్టర్ మోదుగు ప్రభాకర్ రావు ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల భద్రాచలం పట్టణంలో అక్షయ ఫంక్షన్ హాల్లో టీయు డబ్ల్యూజె ఐజెయు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ సమక్షంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు జెవి రత్నం,ప్రధాన కార్యదర్శి జూనుమల రమేష్ తోపాటుగా మోదుగు ప్రభాకర్ రావును జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. జూలూరుపాడు మండలం నుంచి జిల్లా కమిటీలో స్థానం పొందిన ప్రభాకర్ రావును సహచర జర్నలిస్టులు, మిత్రులు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, మిత్రులు నున్న గోపాలరావు, ముత్తినేని బాబీ, షేక్ సిద్దిక్, బోడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సీతారామ జలాలు అందించాలి

**ప్రజావిక్షం/ములకలపల్లి:** అశ్వాపురం మండల రైతులకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ నేడు ఉదయం 10గంటలకు కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిల పక్ష, మిత్రపక్ష పార్టీలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి స్థానిక రైతులకు నీరు విడుదల చేయాలని, లేనిపక్షంలో సీతారామ పంప్ హౌస్ ముట్టడి, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపడతామని నిర్వాహకులు హెచ్చరించారు. అఖిలపక్ష పార్టీలు, రైతు సంఘాల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.